

సౌఖ్యం
తటవర్తి వీరరాఘవరావు

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# సత్యం



రచన & ప్రచురణ : తటవర్తి వీరరాఘవరావు


ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2023
కాపీలు : 2,000

వెల : రూ. 40/-



పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**

**తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.**


**సెల్ : 9440309812**

email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | సత్యం | 3 |
| 2. | సత్యం అంటే దైవం యొక్క లక్షణాలు | 9 |
| 3. | "సత్యాన్ని ఆశ్రయిస్తే" | 13 |
| 4. | సత్యం గొప్పతనం! | 14 |
| 5. | శంకరాచార్యుల వారి ఆత్మ బోధ | 20 |
| 6. | సత్యము గురించి ఉపనిషత్తుల లోని వాక్యాలు | 22 |
| 7. | జ్ఞాననేత్రం | 24 |
| 8. | సత్యాన్ని పొందితే | 26 |
| 9. | ఆత్మ విచారణ | 27 |
| 10. | ఆత్మానాత్మ వివేకము | 28 |
| 11. | సదానందయోగి ఏమన్నారంటే? | 30 |





బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,***
*తటవర్తి వారి వీధి, భీమవరం - **534 201.***
*సెల్ : 94403 09812, 94901 71853*

# సత్యం

ఈ సృష్టిలో సత్యం, అసత్యం రెండూ ఉన్నాయి. వీటి గురించి బాగా తెలుసుకోవాలి.

అసలు సత్యం అంటే ఏమిటి?

సత్యం అంటే? నిత్యమైనది.

మరి నిత్యమైనది అంటే? శాశ్వతమైనది.

శాశ్వతమైనది అంటే? ఎల్లప్పుడూ వుండేది.

ఎల్లప్పుడూ వుండేది అంటే? మార్పు చెందనిది.

మార్పు చెందనిది అంటే ? కాలం మారినా, యుగాలు మారినా మారనిది.

ఒక రకంగా చెప్పాలంటే సత్యం అన్నది నిత్యమై వుండాలి, శాశ్వత మైనదై వుండాలి, ఎల్లప్పుడూ వుండాలి, అంతేకాదు మార్పు చెందకుండా వుండాలి, ఇంకా చెప్పాలంటే? కాలం మారినా, యుగాలు మారినా మారకుండా వుండాలి. ఇలాంటి లక్షణాలు దేనిలో వుంటాయో అదే సత్యం. ఈ లక్షణాలు దేనిలో లేకపోయినా అది అసత్యమే.మరి ఆ లక్షణాలు దేనిలో వున్నాయి అంటే? ఒక్కటే ఒక్కటి. అదే భగవంతుడు. ఆయననే ఆత్మ అని అంటారు. అందుచేత భగవంతుడే సత్యం. అంటే ఆత్మే సత్యం అని తెలుసుకోవాలి. సృష్టిలో ఆత్మ తప్ప అన్నీ అసత్యమే!

వేదాలలో "సత్యమేవ జయతే" అని చెప్పబడినది. అంటే సత్యమే జయిస్తుందని స్పష్టంగా చెప్పబడింది.

అందుచేత మానవుడు ఎందులో విజయం సాధించాలన్నా అంటే జయం పొందాలన్నా సత్యంలో జీవించ వలసిందే!

మానవుడు చాలా జయించాలి. దుఃఖాన్ని జయించాలి, అశాంతిని జయించాలి, భాధల్ని జయించాలి, కష్టాల్ని జయించాలి, సమస్యల్ని జయించాలి. మరి ఇవన్నీ సత్యాన్ని ఆశ్రయించిన వారు, సత్యం మాట్లాడేవారు, సత్యంలో జీవించేవారే సాధించగలరు.

అందుచేత అసత్యాన్ని ఆశ్రయించినా, అసత్యంలో జీవిస్తున్నా, అసత్యం మాట్లాడుతున్నా... వారికి అన్నీ అపజయాలే! అంటే వారికి కష్టాలు, నష్టాలు,

దుఃఖాలు, రోగాలు,  అశాంతి, భాధలు అన్నీ వుంటాయని తెలుసుకోండి.

మరి అసత్యం అంటే ఏమిటో తెలియాలి అంటే? ముందు సత్యం అంటే ఏమిటో తెలుసుకోవాలి. సత్యం అంటే సాక్షాత్తూ భగవంతుడు అని చెప్పుకున్నాం. ఆయననే ఆత్మ అంటారు అని కూడా చెప్పుకున్నాం. అంటే ఆత్మే సత్యం.. భగవంతుడే సత్యం.. ఆయననే  హిందూ మతంలో పరబ్రహ్మ అని, ముస్లింలు అల్లా అని, క్రిస్టియన్లు తండ్రి అని అంటారు.

ఆదిశంకరాచార్యులవారు  "బ్రహ్మ సత్యం – జగత్ మిథ్య".. అని అన్నారు.  ఆయన చెప్పిన దాన్ని బట్టి భగవంతుడు ఒక్కడే శాశ్వతమైనవాడు. మిగిలినవన్నీ అంటే జగత్తులో వున్నవన్నీ అశాశ్వతమైనవే, అంటే వుండనివే అంటే అదృశ్యమయ్యేవే అని తెలుసుకోవాలి. అందుచేత భగవంతుడు తప్ప మిగిలినవన్నీ అసత్యాలే.. అంటే ఆత్మ తప్ప అన్నీ అసత్యాలే.. అంటే ఆత్మ కానివన్నీ అసత్యాలే అని శంకరాచార్యుల వారు చెప్పడం జరిగింది.

అందుచేత తెలుసుకోండి ఆత్మను తప్ప  దేనిని ఆశ్రయించినా అసత్యాన్ని ఆశ్రయించినట్లే! ఒకరకంగా చెప్పాలంటే రూపం కలిగినవన్నీ అంటే ఈ కళ్ళకు కనిపించేవన్నీ అసత్యాలే. ఇంకా చెప్పాలంటే?  సత్యం సృష్టింపబడనిది, అంతం కానిది అంటే సత్యానికి పుట్టుక లేదు, చావు లేదు.

ప్రపంచంలో ఎక్కడ చూసినా దుఃఖం, అశాంతి, బాధ, కష్టం తాండవిస్తుంది.   ప్రపంచం మొత్తం గమనిస్తే ఇది అర్థమవుతుంది.  ప్రతి ఒక్కరికి ఏదో ఒకరకమైన దుఃఖం ఉంది. దుఃఖం అంటే **"ఏ సమస్య వల్ల భాధ కలిగినా దానిని దుఃఖం అంటారు."**

గమనిస్తే మానవులకు అనేకరకాల సమస్యలు ఉన్నాయి.

1. ఆరోగ్య సమస్యలు:– ఇవి కొన్ని వందలే కాదు, వేలకు వేలే వున్నాయి.
2. ఆర్థిక సమస్యలు :– ఇవికూడా వందల రకాలు ఉన్నాయి.
3. కుటుంబ సమస్యలు:– అంటే కుటుంబీకులు, బంధువుల మధ్య ఉండే సమస్యలు.
4. సంసార సమస్యలు :– అంటే భార్యా, భర్తల మధ్య ఉండే సమస్యలు.
5. ఇరుగు పొరుగు వారితో ఉండే సమస్యలు.
6. వృద్ధాప్యపు సమస్యలు :– అంటే ముసలితనంలో ఉండే సమస్యలు.
7. మరణానంతర జీవిత సమస్యలు.

మరి మానవులు ఇలాంటి సమస్యలతో భాధపడటానికి కారణం? అందరూ అసత్యంలో జీవించడమే! అంటే అంతా అసత్యాన్ని ఆశ్రయి స్తున్నారు, అసత్యం మీదే మోజు పెంచుకున్నారు, అసత్యమే గొప్పదను కుంటున్నారు, అసత్యం వెంట పడుతున్నారు. తెలుసుకోండి అసత్యం వెంట పడినంత కాలం ఎవరి బ్రతుకైనా ఇంతే. ఎంతమంది దేవుళ్లను ఆశ్రయించినా, ఎన్ని తీర్థయాత్రలు చేసినా, ఎంతమంది గురువులను, స్వామీజీలను, బాబాలను ఆశ్రయించినా వారు దుఃఖం నుండి బయటపడలేరు.

లోకమంతా అసత్యాన్ని ఆశ్రయిస్తున్నారు. అంటే అసత్యమైన విగ్రహాలను, ఫోటోలను, ప్రతిమలను ఆరాధిస్తున్నారు. ఇక్కడ అసత్యం అంటే ఒకప్పుడు వుండి తర్వాత ఉండనిది, మార్పు చెందినది, శాశ్వతం కానిది.

ఒకరకంగా చెప్పాలంటే విగ్రహాలను ఆరాధించే వారంత అసత్యాన్ని ఆరాధిస్తున్నట్టు. అందుకే చిన్ననాటి నుండి పూజలు చేస్తున్నా, ఫోటో పెట్టి ప్రార్థనలు చేస్తున్నా... దుఃఖంలో అంటే సమస్యలతోనే ఉంటున్నారు. కారణం వారికి ఆత్మే సత్యం అని తెలియదు.

చాలా మంది పూజ చేస్తే పుణ్యం వస్తుందని అనుకుంటారు. కాని దైవాన్ని కాకుండా అంటే ఆత్మను కాకుండా అసత్యాన్ని ఆరాధిస్తే పుణ్యం ఎలా వస్తుంది? చెప్పినా అర్థం కాదు.

పత్రీజీ పిరమిడ్ ధ్యానుల 18 ఆదర్శ సూత్రాలలో "అసత్యమైన విగ్రహారాధన వద్దు, సత్యమైన ఆత్మనే ఆరాధించాలని" అన్నారు. కారణం సత్యమే భగవంతుడు కాబట్టి. అందుచేత ఆత్మను అంటే భగవంతుడినే పట్టుకోవాలి అంటే ధ్యానం చెయ్యాలి అని పత్రి గారు చెప్పడం జరిగింది.

కారణం భగవంతుడే ఆత్మ అని భగవద్గీతలో 10వ అధ్యాయంలో 20వ శ్లోకంలో సాక్షాత్తూ శ్రీ కృష్ణభగవానుడే స్పష్టంగా చెప్పడం జరిగింది.

**శ్లో॥ అహమాత్మా గుడాకేశ సర్వభూతాశయస్థితః**
**అహమాదిశ్చ మధ్యం చ భూతానామన్త ఏవ చ (భ.గీ.10-20)**

తా:- ఓ అర్జునా! సర్వ ప్రాణులలో స్థితమై వున్న ఆత్మను నేనే అయి వున్నాను. మరియు ప్రాణుల యొక్క ఆదిమధ్యాంతములు నేనే అయి వున్నాను.

శ్రీ కృష్ణ భగవానుడు స్వయంగా చెప్పిన ఈ శ్లోకాన్ని బట్టి ఆత్మే దైవమని, అంటే భగవంతుడని, ఆయన సమస్త ప్రాణుల శరీరాలలో వున్నాడని మనం

స్పష్టంగా తెలుసుకోవచ్చు.

అందుచేత సత్యాన్ని ఆరాధించాలి అంటే ఆత్మను ఆరాధించాలి. మరి శరీరంలో వున్న ఆత్మను ఆశ్రయించాలంటే శరీరం లోపలికి వెళ్ళాలి. మరి శరీరం లోపలకి వెళ్ళాలి అంటే ఒక్కటే మార్గం... అదే పత్రీజీ చెప్పిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

మరి భగవద్గీతలో నేను ఆత్మను అని శ్రీకృష్ణులవారు స్పష్టంగా చెప్పారు కదా? అందుచేత అసత్యాన్ని వదిలి సత్యాన్ని పట్టుకున్నవాడే గొప్పవాడు, అంతే కానీ పూజలు చేస్తూ ధ్యానం చేసేవాడు కూడా గొప్పవాడు కాదు. కారణం వాడు ఇంకా అసత్యాన్ని వదల లేదు, సత్యాన్ని నమ్మలేదు.

భగవద్గీతలో సత్యాన్ని పట్టుకోమనే చెప్పబడింది. అందుచేత ఎవరైతే ఆత్మను పట్టుకుంటారో వారు సాక్షాత్తూ భగవంతుని పట్టుకున్న వారు అవుతారు. వారు భగవంతుని పొందుతారు, దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడతారు. ఆ విషయమే ఈ క్రింది శ్లోకాలలో చెప్పబడింది.

**శ్లో॥ యే త్వక్షరమనిర్దేశ్యమవ్యక్తం పర్యుపాసతే**
**సర్వత్రగమచినత్యం చ కూటస్థమచలం ధ్రువమ్ ॥ (భ.గీ.12-3)**

**సంనియమ్యేన్ద్రియగ్రామం సర్వత్ర సమబుద్ధయః ।**
**తే ప్రాప్నువన్తి మామేవ సర్వభూతహితే రతాః ॥ (భ.గీ.12-4)**

తా:- ఎవరు ఇంద్రియములన్నింటిని స్వాధీన పరచుకుని, ఎల్లెడలా సమభావం కలవారై, సమస్త ప్రాణులకు హితమొనర్చుటకు ఆసక్తి కలవారై, ఇట్టిదని నిర్దేశింప శక్యం కానిది, ఇంద్రియములకు గోచరం కానిది, ఇట్టిదని ఊహింప నలవి కానిది, నిర్వికారమైనది, చలించనిది, నిత్యమైనది, అంతటను వ్యాపించి ఉన్న దగు అక్షర పరబ్రహ్మను అంటే ఆత్మను ధ్యానించుచున్నారో! వారు నన్ను పొందుచున్నారు.

శ్రీ కృష్ణుల వారు చెప్పినట్టు ఇంద్రియాలను స్వాధీనం చేసుకోవాలంటే? ముందు కళ్ళు మూసుకోవాలి. చేతులు కట్టాలి. కాళ్ళు ముడుచుకోవాలి. అప్పుడు ఆలోచనలు వస్తాయి. వాటిని కట్ చేసి 'శ్వాస'ను గమనించాలి. కాసేపటికి ఆలోచనలు అన్నీ ఆగిపోతాయి. మనస్సు కూడా పనిచేయదు. అప్పుడు వారు శ్రీ కృష్ణుల వారు చెప్పినట్టు ఇంద్రియాలను స్వాధీనం చేసుకున్నవారు అవుతారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే? అందరిపట్ల సమభావం కలిగి వుండాలన్నారు. అందరూ అంటే ? మానవులతో పాటు అన్ని జీవులు ఒక్కటే వేరు వేరు కాదు. అన్న భావం కలిగి వుండాలన్నారు.

శ్రీ కృష్ణుల వారు ఇంకా ఏమన్నారంటే? సమస్త ప్రాణులకు హితం చేయటానికి ఆసక్తి కలిగి వుండాలన్నారు. అంటే అన్ని రకాల జంతువులు, పక్షులు, జలచరాలను హింసించకుండా, చంపకుండా రక్షించాలన్నారు.

అలా జీవిస్తూ మానవ ఇంద్రియాలకు కనిపించనిది, మానవుడు వూహించలేనిది, ఆకారం లేనిది, చలించనిది, నిత్యమైనది అంటే ఎప్పుడూ వుండేది, అంతటా వ్యాపించి వున్నది అంటే సమస్త సృష్టి అంతా వ్యాపించి వున్నదియైన అక్షర పరబ్రహ్మ అంటే నశింపులేని, కనిపించని అందరి కంటే గొప్పవాడైన భగవంతుని అంటే ఆత్మను ఎవరైతే ధ్యానం చేస్తారో వారు నన్ను పొందుతారు అని శ్రీ కృష్ణుల వారు చెప్పడం జరిగింది.

ఇక్కడ మనం తెలుసుకోవలసింది ఏమిటంటే? భగవంతుని అంటే సత్యాన్ని పొందడం అంత తేలికైన, సామాన్యమైన విషయం కాదు. కానీ ధ్యానం చేస్తే అది సాధ్యమవుతుంది. అటువంటి వారు సమస్త దుఃఖాల నుంచి శాశ్వతంగా బయటపడగలుగుతారు. అందుకే పత్రిగారు సత్యారాధన చెయ్యాలి అన్నారు.

అలాగే సత్యసాయిబాబా పంచశీలాలు బోధించారు. అవే సత్యం, ధర్మం, అహింస, ప్రేమ, శాంతి. అంటే ఆయన ప్రథమంగా సత్యం గురించే చెప్పారు.

ఆ సత్యాన్నే హిందూమతంలో పరమాత్మ, పరబ్రహ్మ, భగవంతుడు, సృష్టికర్త, విశ్వాత్మ, పరమేశ్వరుడు, లలితాదేవి, ఆదిశక్తి అని రకరకాల పేర్లతో పిలుస్తారు. ముస్లింలు అల్లా అంటారు, క్రిష్టియన్లు తండ్రి అంటారు.

పత్రిగారు కూడా అటువంటి సత్యాన్నే ఆశ్రయించమన్నారు, సత్యాన్నే ఆరాధించమన్నారు. ఆయన 18 ఆదర్శ సూత్రాలలో 14 వ సూత్రం "విగ్రహారాధన వద్దు, సత్యారాధనే చేయాలి" అన్నారు. మరి అటువంటి సత్యం ఎవరికి అర్థం అవుతుందంటే? సత్యాన్ని ఆశ్రయించిన వారికే కాని, సత్యాన్ని ఆశ్రయించని వారికి అర్థం కాదు.

వేదాల్లో "సత్యమేవ జయతే" అని చెప్పబడింది. అంటే సత్యమే జయిస్తుంది అంటే మీరు సత్యాన్ని ఆశ్రయించినా, సత్యంలో జీవిస్తున్నా,

జీవితంలో అన్ని విషయాలలో జయం పొందుతారు. మరి జీవితంలో ఎవరు విజయం పొందినట్లు. అంటే ఎవరైతే దుఃఖంనుంచి శాశ్వతంగా బైటపడతారో! వారే విజయం పొందినట్టు. దానినే పెద్దలు "మోక్షం" అని అన్నారు. ఈ మోక్షం సత్యాన్ని ఆశ్రయించడం వల్ల వస్తుంది.

సృష్టిలో వృక్షజాతి, క్రిమి కీటక సర్పజాతి, పక్షిజాతి, జంతు జాతి, మానవజాతి, సూర్యుడు, చంద్రుడు, నవగ్రహాలు ఇలా చూస్తే సృష్టిలో ఎన్నో వున్నాయి. మరి వీటిలో వేటికైనా ఆత్మకు అంటే సత్యానికి ఉన్న లక్షణాలు ఉన్నాయా? అంటే లేవు అని ఖచ్చితంగా చెప్పవచ్చు. అంటే ఈ సృష్టిలో సృష్టి చేయబడినది ఏదీ సత్యం కాదు అని తెలుస్తుంది. కారణం సృష్టించ బడినవన్నీ అదృశ్యమయ్యేవే, అంతమయ్యేవే. అందుచేత సృష్టింపబడనిదే సత్యం, అంతంకానిదే సత్యం, అదే భగవంతుడు, ఆయనే పరబ్రహ్మ ఆయననే ఆత్మ అని అంటారు.

పత్రీజీ ఒక సందర్భముగా ఏమన్నారంటే ప్రతి ఒక్కరూ నారాయణుడు కావాలన్నారు. అలాంటి వారికే లక్ష్మీదేవి అనుగ్రహం కలుగుతుందన్నారు, అంటే భోగం పొందుతారన్నారు, అంటే సుఖంగా జీవిస్తారని చెప్పారు. మరి నారాయణుడు కావాలంటే ఆత్మను అంటే సత్యాన్ని ఆశ్రయించాలి అంటే ధ్యానం చేయాలి అని అన్నారు.

# సత్యం అంటే దైవం యొక్క లక్షణాలు

1. సర్వవ్యాపి :- సకల చరాచర సృష్టి అంతా వ్యాపించి ఉన్నవాడు.
2. స్థానవిశేషం లేనివాడు:- ఒక్క చోటే ఉండే వాడు కాదు.
3. సర్వాంతర్యామి:- సర్వ జీవులలో అంతర్యామిగా ఉన్న వాడు.
4. నిరాకారుడు:- ఆకారం లేని వాడు.
5. అవ్యక్తుడు:- వ్యక్తము కానివాడు, కనిపించని వాడు.
6. నామ రహితుడు:- పేరు లేని వాడు.
7. రూప రహితుడు:- రూపం లేని వాడు.
8. విధేహుడు:- దేహం లేని వాడు, చేతులు పాదాలు లేని వాడు, వస్త్ర, భూషణములు లేని వాడు.
9. శ్రవణ హీనుడు:- చెవులు లేని వాడు, నేత్రాలు లేనివాడు, గోత్రం లేనివాడు.
10. స్వయంసిద్ధుడు:- బాల్య, యవ్వన వార్ధక్యాలతో సంబంధం లేని వాడు.
11. దర్శించ నలవి కానివాడు:- భౌతికమైన కళ్ళతో చూడలేని వాడు.
12. ఇంద్రియా తీతుడు:- ఇంద్రియాలకు అతీతుడు. మానవ ఇంద్రియాలతో తెలుసుకోలేని వాడు. అంటే జ్ఞానేంద్రియాలతో కాని, కర్మేంద్రియాలతో కాని, ఆఖరుకు మనసుతో కానీ తెలుసుకోలేని వాడు.
13. అప్రమేయుడు:- ఉపమానాల ద్వారా తెలపటానికి వీలు లేని వాడు.
14. నిర్గుణుడు:- గుణములు లేనివాడు.
15. వర్ణ హీనుడు:- కులగోత్రాలు లేనివాడు. లింగ, వచన, విభక్తులు లేని వాడు.
16. నిర్మలుడు:- నిర్మల మైన వాడు, మలినం లేని వాడు.
17. అవ్యయుడు:- క్షీణించని వాడు, నాశనము కానివాడు.
18. అవినాశి:- నాశనం లేనివాడు.
19. చావు పుట్టుకలు లేనివాడు:- ఆరంభము, అంతము లేనివాడు. సృష్టింపబడనివాడు, అంతం చేయలేనివాడు.
20. అనంతుడు:- ఆది, అంతములు లేని వాడు.
21. అపరిమితుడు:- పరిమాణము లేనివాడు.
22. షడూర్మ రహితుడు:- అంటే 1. జనన, మరణాలు శరీర ధర్మం. 2. ఆకలి, దప్పికలు ప్రాణధర్మం. 3. శోక, మోహాలు మనోధర్మం. ఇవన్నీ లేనివాడు.
23. రాగద్వేషాలు లేని వాడు:- అనురాగము, ద్వేషం లేని వాడు. శత్రు, మిత్రులు లేనివాడు. అంటే పూజ చేసిన వారిని ఒక రకంగా, చేయని వారిని ఇంకొక రకంగా చూడడు.

24. జగన్నాటక సూత్ర ధారుడు:- ఈ జగత్తు అనే నాటకానికి సూత్రధారుడు. నిర్మాత, దర్శకుడు ఆయనే.

25. నిశ్చలుడు:- నిశ్చలంగా ప్రకాశిస్తున్న వాడు.

26. సాక్షీభూతుడు:-అన్నిటికీ సాక్షి అయినవాడు. ఎవరి విషయంలో ఆయన తల దూర్చడు.

27. పరిపూర్ణుడు:- పరిపూర్ణంగా నిండి ఉన్న వాడు.

28. కాలాతీతుడు:- కాలానికి అతీతమైనవాడు.

29. అఖండుడు:- ఖండాలుగా లేని వాడు, అంటే అఖండంగా ఉన్నవాడు, ఒక్కటిగా ఉన్న వాడు.

30. అక్షరుడు:- నాశనం లేని వాడు.

31. స్వయం ప్రకాశ మానుడు:- ఒకరి వల్ల ప్రకాశించే వాడు కాదు, స్వయంగా ప్రకాశించే వాడు.

32. ఇచ్ఛ లేనివాడు:- కోరికలు లేని వాడు.

33. క్రియాహీనుడు:- కర్మలు చేయనివాడు.

34. నిష్క్రియుడు:- కర్మలు చేయనివాడు.

35. ఉపాధి హీనుడు:- ఉపచారాలు లేనివాడు.

36. అకల్పితుడు:- ఆకారం కల్పించ లేరు, సృష్టించలేరు.

37. స్వయంభూ:- ఎవరిచేత సృష్టింపబడని వాడు, తనకు తానుగా ఉన్నవాడు, ప్రాణప్రతిష్ట చేయలేరు.

38. ఆది మధ్యాంత రహితుడు:- అంటే మొదలు, మధ్య, చివర లేనివాడు అంటే ఎప్పుడూ వుండేవాడు.

39. అణువణువు వ్యాపించి ఉన్నవాడు:- ఆయన లేని ప్రదేశం అంటూ ఏదీ లేదు. అందుకే అటువంటి వానికి ఆవాహన, విసర్జనలు చేయలేరు.

40.సకల చరా చర రూపుడు:- సృష్టిలోని చరాలు అంటే చరించేవి అంటే క్రిమికీటకాలు, పక్షులు, జంతువులు, మానవుల లాంటివి, అలాగే అచరాలు అంటే చరించనివి అంటే వృక్షాలు, ఖనిజాలు లాంటి రూపాలు కలిగి వున్నటువంటివాడు. అంటే అన్నిటా, అంతటా వ్యాపించి ఉన్నవాడు.

41.అభోక్త:- భోగిస్తూ వున్నా భోగించని వాడు. చూస్తూవున్నా చూడనట్టు వుంటాడు.

42.పక్షపాత రహితుడు:- ఏపక్షం వహించని వాడు. అంటే ఎవరిపట్ల పక్షపాతం ఉండదు. అంటే ఒకరిని ఎక్కువగా ఇంకొకరిని తక్కువగా చూడటమంటూ వుండదు.

43.అద్వైతుడు:- ద్వైతం కాని వాడు, రెండుగా లేనివాడు, ఒక్కటై ఉన్న వాడు.

44. నిత్యుడు:– నిత్యమైనవాడు.

45. శాశ్వతుడు:– శాశ్వతమైనవాడు, అంటే ఎల్లప్పుడూ ఉండేవాడు.

46. సత్యమైన వాడు:– మార్పు చెందని వాడు, యుగాలు మారినా మారనివాడు.

47.చైతన్యస్వరూపుడు:– సమస్త జీవరాసికి చైతన్యం కలిగించేవాడు, అంటే కదలగలిగే, పనిచేసే శక్తిని ఇచ్చినవాడు.

48.ఆనందస్వరూపుడు:– ఎల్లప్పుడూ ఆనందంలో ఉండేవాడు. అంటే ఆనందమే ఆయన స్వరూపం.

49. సచ్చిదానంద స్వరూపుడు:–అంటే (సత్–చిత్–ఆనందము)

సత్ అంటే సత్యస్వరూపము.

చిత్ అంటే చైతన్యస్వరూపము.

ఆనందం అంటే ఆనందస్వరూపము.

50. నాశరహితుడు:– నాశనము కానివాడు, అవినాశి.

51. మాయాతీతుడు:– అంటే మాయకు లోబడనివాడు.

52. చిద్రూపుడు:– మహత్తరమైన రూపము కలవాడు.

53. సనాతనుడు:– ఆది, ఆరంభం లేనివాడు, అనాది రూపుడు.

54. అనంత శక్తి స్వరూపుడు:– వర్ణించలేనంత శక్తి కలవాడు. అందుకే ఆత్మలేని దేహాన్ని అంటే శవాన్ని ఎవరు పని చేయించలేరు, కాని ఆత్మ దేహాన్ని పని చేయించగలదు. అంతేకాదు సృష్టిలోని 84 లక్షల జీవరాసులు కూడా ఆత్మవల్లే కదులుతున్నాయి. అందుకే ఆత్మ అనంత శక్తి కలది అన్నారు.

55. తురీయాతీతుడు:– తురీయం కంటే అతీతంగా ఉన్నవాడు.

1. జాగ్రత్త: శరీరం, ఇంద్రియాలు పనిచేస్తాయి.
2. స్వప్న: మనసు మాత్రమే పనిచేస్తుంది.
3. సుషుప్తి: మనసు పనిచేయదు.
4. తురీయం: మనసే ఉండదు అంటే శూన్యం అయిపోతుంది.
5. తురీయాతీతం:ఏదీ ఉండదు, మహాశూన్యం.

56. పరాత్పరుడు:– పరం కంటే పరంగా ఉన్న వాడు.

57. విశ్వరూపుడు:– విశ్వమంతా ఆయన రూపమే.

58. విశ్వాత్మ:– విశ్వమంతా వ్యాపించివున్న ఆత్మ.

59. మూలాత్మ:– అన్ని ఆత్మలకు మూలమైన ఆత్మ.

60. పరమాత్మ:–అందరి కంటే గొప్పవాడు.

61. పరబ్రహ్మ:– అందరికీ తండ్రి అయిన వాడు.

62. సృష్టికర్త:- సకల చరాచర సృష్టిని సృష్టించిన వాడు.

ఒక రకంగా చెప్పాలంటే? సత్యం గురించి అంటే భగవంతుని గురించి ఎవ్వరూ వర్ణించలేరు, చెప్పలేరు, తెలుసుకోలేరు, ఆయన అన్నిటికీ అతీతుడు. అంతటి గొప్ప వాడు భగవంతుడు.

అందుచేత ఎవరైతే సత్యాన్ని ఆశ్రయిస్తారో! వారు శక్తివంతులు అవుతారు. మరి శక్తివంతులు అవుతే ఏమవుతుంది? అంటే వారు ఒక రమణ మహర్షి, స్వామి వివేకానంద, వీర బ్రహ్మేంద్ర స్వామి, షిర్డీ సాయిబాబా, పత్రీజీ లాంటి వారిలా అవుతారు. అలాంటి వారు యుగయుగాల నుంచి ఎంతో మంది అయ్యారు. వారంతా ఎంతో శక్తిని పొందారు. శక్తివంతులు అయ్యారు.

అలా శక్తి పొందినవారి ప్రవర్తన ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

1. ఎటువంటి పరిస్థితుల్లో అబద్ధం ఆడరు.
2. సృష్టి విరుద్ధమైన పనులు చెయ్యరు.
3. విమర్శించరు, ఎవరి మీద అసూయ పడరు.
4. గొప్పలుచెప్పుకోరు, ఆశపడరు.
5. వర్తమానంలో జీవిస్తారు.
6. సాక్షీభూతంగా వ్యవహరిస్తారు.
7. త్రికరణ శుద్ధిగా జీవిస్తారు.
8. వేటిని హింసించరు. చీమల్ని, దోమల్ని, బొద్దింకల్ని మొ॥గు వాటిని కూడా చంపరు.
9. ఎవరినీ ద్వేషించరు, అందరినీ ప్రేమిస్తారు.
10. కోరరు. అన్నీ అందరికీ పంచుతారు.
11. ఎవరి కాళ్ళమీద పడరు.
12. రాగద్వేషాలు ఉండవు.
13. ద్వంద్వాలలో అంటే మానావమానాలలో, నిందాస్తుతులలో, గెలుపు ఓటములలో, సుఖ దుఃఖాలలో, శోక మోహాలలో, చావు పుట్టులో సమస్థితిలో ఉండగలరు.
14. ధర్మంగా జీవిస్తారు.
15. జ్ఞానం పొందడమే కాదు, అందరికీ జ్ఞానవంతులు చేయడానికి ప్రయత్నిస్తారు.
16. సత్యంలో జీవిస్తారు.
17. ఆత్మకర్మలు, ఆత్మ సేవలు చేస్తారు.
18. పూర్ణాత్మలు అవుతారు. సత్యలోకం చేరుకుంటారు.

# "సత్యాన్ని ఆశ్రయిస్తే"

సత్యాన్ని ఆశ్రయించినవారు అంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేసిన వారి ప్రవర్తన ఎలా మారిపోతుందో తెలుసుకుందాం.

1. సత్యాన్ని ఆశ్రయించిన వారు అన్ని జీవుల మీద జాలి, దయ, కరుణ చూపించగలుగుతారు, వాటిని రక్షిస్తారు;
2. సత్యాన్ని ఆశ్రయించిన వారు అందరికీ మేలు చేస్తారు.
3. సత్యాన్ని ఆశ్రయించిన వారు కక్షగట్టరు, కారుణ్యం ప్రదర్శిస్తారు.
4. సత్యాన్ని ఆశ్రయించిన వారు అందరితో స్నేహంగా ఉంటారు.
5. సత్యాన్ని ఆశ్రయించిన వాడు అరిషడ్వర్గాలు అంటే కామాన్ని అంటే కోరికల్ని, క్రోధాన్ని అంటే కోపాన్ని, లోభాన్ని అంటే పిసినారితనాన్ని, మోహాన్ని అంటే విపరీతమైన వ్యామోహాన్ని, మదాన్ని అంటే గర్వాన్ని, మత్సర్యాన్ని అంటే అసూయను అదుపులో ఉంచుకుంటారు;
6. సత్యాన్ని ఆశ్రయించిన వారు అందరికీ ఆదర్శవంతులు అవుతారు.
7. సత్యాన్ని ఆశ్రయించిన వారికి బుద్ధి వికసిస్తుంది.
8. సత్యాన్ని ఆశ్రయించిన వారికి జ్ఞానం ఉదయిస్తుంది.
9. సత్యాన్ని ఆశ్రయించిన వారు అంతా ఒక్కటే అని తెలుసుకుంటారు. అందరినీ, అన్నిటినీ ప్రేమిస్తారు.
10. సత్యంతో ఉండడమే రాజయోగము. రాజయోగమే అన్ని యోగాల కన్నా గొప్పది.

అందుచేత సత్యాన్ని ఆశ్రయించిన వారికి ఇన్ని రకాల మార్పులు, లాభాలు కలుగుతాయి. కానీ అసత్యంలో జీవించినా, అసత్యాన్ని ఆచరించినా, ఆరాధించినా ఇటువంటి మార్పులు రావు.

# సత్యం గొప్పతనం!

వేదాలలో "సత్యం వద - ధర్మం చర." అని చెప్పబడింది. అంటే సత్యాన్ని పలకాలి. ధర్మాన్ని ఆచరించాలి అని అర్థం.

ఎందుచేతనంటే మానవుడు రెండు రకాలుగా కర్మలు చేస్తాడు. 1.మాటలతో, 2.చేతలతో.

మానవుడు చేసే కర్మలు మానవులకు నష్టం కలిగించని రీతిలో వుండాలంటే మాటలు సత్యంగా వుండాలి, అంతా సత్యమే మాట్లాడాలి. కానీ అసత్యాన్ని ఆశ్రయించిన వారు సత్యం మాట్లాడలేరు.

అలాగే చేతలు ధర్మంగా వుండాలి. అంటే ధర్మ యుక్తమైన పనులే చేయాలి.

అంతే కాదు " సత్యమేవ జయతే" అని కూడా చెప్పబడింది. అంటే సత్యమే జయిస్తుంది అని అర్థం. అంటే ఏ విషయంలోనైనా సత్యమే జయిస్తుంది అని తెలుసుకోవాలి. అందుచేత సత్యం కాని వాటివల్ల అంటే అసత్యంవల్ల అపజయమే కలుగుతుందని కూడా తెలుసుకోవాలి.

అందుచేత సత్యాన్ని తెలుసుకోవాలి, సత్యాన్నే ఆశ్రయించాలి, సత్యమే పలకాలి, సత్యంలోనే జీవించాలి.

వేదాలలో "తత్వమసి" అని చెప్పబడింది.

తత్ అంటే అది అంటే సత్యం అంటే భగవంతుడు. మసి అంటే అయి వున్నావు. అంటే "అదే నీవు అయి వున్నావు". అంటే సత్యమే నీవు అయివున్నావు అని అర్థం.

ఎవరికైనా సత్యం బోధపడితే తప్ప ఏది బోధపడదు, అన్నీ సందేహాలే! అన్ని సంశయాలే! అలాగే సత్యం అర్థం అవుతే తప్ప ఏది అర్థం కాదు, అంతా అయోమయమే, అంతా గందరగోళమే. అలాగే సత్యం తెలిస్తే తప్ప ఏది తెలియదు, అంతా అగమ్య గోచరమే.

అంతేకాదు సత్యాన్ని ఆశ్రయించిన వారికే శాంతి, ఆనందం. లేకపోతే అశాంతి, దుఃఖం.

అంతేకాదు పత్రీజీ ఏమంటారంటే?సత్యంలో జీవించడమే ఆధ్యాత్మికత

అంటారు. అసత్యంలో జీవించడమే అనాధ్యాత్మికత అంటారు.

అలాగే సత్యాన్ని ఆశ్రయిస్తే తృప్తి, సంతృప్తి లేకపోతే అసంతృప్తి.

మానవునకు ఎప్పటికైనా సత్యాన్ని ఆశ్రయించడం తప్ప వేరొక మార్గం లేదని తెలుసుకోవాలి. మరి సత్యాన్ని ఆశ్రయించే మార్గమే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

చూడండి మన కంటికి కనిపించే ప్రపంచాన్నే తీసుకుందాం. అందులో ఏది శాశ్వతంగా ఉంటుంది? ఏది మార్పు చెందకుండా ఉంటుంది? ఏది ఎల్లప్పుడూ ఉంటుంది? అంటే ఏదీ ఉండదు.

అలా గమనిస్తే అనంతంగా ఉన్న వృక్షజాతి కాని, క్రిమి కీటక జాతి కాని, మత్స్యజాతి కానీ, పక్షి జాతి కానీ, జంతు జాతి కానీ, మానవ జాతి కానీ అన్నీ పుడతాయి, ఎదుగుతాయి అంటే మార్పు చెందుతాయి, చివరకు అంతమై పోతాయి. దేన్ని తీసుకున్నా ఇదే జరిగేది. అందుకే ఏ జీవి శరీరానికైనా ఆరు విధాలైన వికారాలు ఉంటాయి.

అవి ఏవి అంటే?

1. పుడుతుంది. 2. ఉంటుంది. 3. పెరుగుతుంది. 4.మార్పు చెందుతుంది. 5. కృశిస్తుంది. 6. నశిస్తుంది.

అంటే ఏదీ శాశ్వతం కాదు, ఎల్లప్పుడూ ఏది ఉండదు అని తెలుస్తుంది. అంటే ఏదీ సత్యంకాదు అని తెలుస్తుంది.

కాలం మారుతుంటే అన్నీ మారుతూ ఉంటాయి. ప్రపంచంలో మార్పు అన్నది సహజాతి సహజం. మార్పు లేకుండా ఏది ఉండదు. మనం యుగ, యుగాలనుంచి చూస్తున్నాం. రాజ్యాలు పోయాయి, రాజులు పోయారు, ఎందరో వెళ్లిపోయారు. ఎన్నో ఉద్భవించి అదృశ్యమై పోయాయి, అంటే ఏది శాశ్వతం కాదు, సత్యంకాదు అని మనం తెలుసుకోవచ్చు.

ఆఖరికి మన కంటికి కనిపించే సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, గ్రహాలు, గ్రహమండలాలు అన్నీ కూడా సృష్టి అంత మైనప్పుడు నశించిపోయేవే. అంతేకాదు ఆఖరికి అందరూ గొప్పవారిగా భావించే దేవుళ్ళకు కూడా ఆయుష్షు వుంది. అంటే ఆయుష్షు తీరగానే అదృశ్యమైపోతారు. అంటే శాశ్వతం కాదని తెలుస్తుంది. అంటే "ఒక్క భగవంతుడు అంటే పరమాత్మ అంటే పరబ్రహ్మ అంటే ఆత్మ తప్ప అన్ని అదృశ్యమయ్యేవే" అని తెలుసుకోవాలి.

ఈ విషయమే భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు చెప్పడం జరిగింది.

**శ్లో॥ సహస్రయుగపర్యన్తమహర్యద్బ్రహ్మణో విదుః**
**రాత్రిం యుగసహస్రాన్తాం తేఽహోరాత్రవిదో జనాః (భ.గీ.8-17)**

తా:- ఏ జనులు బ్రహ్మదేవుని యొక్క పగటిని వేయియుగముల పరిమితి గల దానిగను, అట్లే రాత్రిని వేయియుగముల పరిమితి గల దానిగను ఎరుంగుదురో, అట్టి వారు రాత్రింబవళ్ళు యొక్క తత్త్వమును బాగుగా ఎరింగిన వారగుదురు.

శ్రీ విద్యా ప్రకాశనందగిరి స్వామి వారు భగవద్గీతలో చెప్పబడిన ఈ శ్లోకం ద్వారా బ్రహ్మదేవుని ఆయుష్షును ఈ క్రింది విధంగా వివరించారు.

| | | | |
|---|---|---|---|
| 1) | కలియుగం | - | 4,32,000 |
| 2) | ద్వాపర యుగం<br>(కలియుగానికి రెండు రెట్లు) | - | 8,64,000 |
| 3) | త్రేతాయుగం<br>(కలియుగానికి 3 రెట్లు) | - | 12,96,000 |
| 4) | సత్యయుగం<br>(కలియుగానికి 4 రెట్లు) | - | 17,28,000 |
| | | మొత్తం | 43,20,000 |

ఈ మొత్తం 43,20,000లు సంవత్సరాలను 1 మహాయుగం అంటారు.

ఇలాంటి 1000 మహాయుగాలు బ్రహ్మదేవునికి ఒక పగలు. ఇంకొక 1000 మహాయుగాలు బ్రహ్మదేవునికి ఒక రాత్రి.

అనగా 43,20,000×1000 = 432,00,00,000 సం॥లు బ్రహ్మకు పగలు

43,20,000×1000 = 432,00,00,000 సం॥లు బ్రహ్మకు రాత్రి

మొత్తం864,00,00,000 సం॥లు బ్రహ్మకు ఒక రోజు

ఇలాంటి 360 రోజులు బ్రహ్మదేవునికి ఒక సంవత్సర కాలం అవుతుంది. అలాంటి వంద సంవత్సరాలు చేరి బ్రహ్మదేవుని ఆయుర్ధాయం అవుతుంది.

దీనిని బట్టి బ్రహ్మకు కూడా ఆయుష్షు వుంది అని అర్థం అవుతుంది. అంటే బ్రహ్మ కూడా శాశ్వతం కాదు అని మనం తెలుసుకోవాలి.

కానీ సృష్టింపబడని పరబ్రహ్మ ఒక్కడే శాశ్వతమైనవాడు, నశింపు లేని వాడు, అంతం లేని వాడు అని తెలుసుకోవాలి.

అందుచేత ఏదీ శాశ్వతం కాదు, ఆత్మ ఒక్కటే శాశ్వతం అని తెలుస్తుంది. అందుచేత 'ఆత్మే సత్యం' అని తెలుసుకోవాలి. అందుకే పత్రీజీ సత్యమైన ఆత్మను ఆశ్రయించ మంటారు. మరి ఆ సత్యాన్ని అంటే ఆత్మను ఆశ్రయించే మార్గం ఏది? అంటే అదే "శ్వాస మీద ధ్యాస ధ్యానం." ఎవరైతే ఈ ధ్యానం చేసి సత్యాన్ని ఆశ్రయిస్తారో! వారి జీవితమే ధన్యం, వారి కంటే అదృష్టవంతుడు ఎవ్వరు ఉండరు.

అందుచేత ఇప్పుడు మనం భగవద్గీతలో యుగాంతం గురించి, సృష్టి అంతం గురించి చెప్పిన విషయాలు తెలుసుకుందాం.

**శ్లో॥ పరస్తస్మాత్తు భావోఽ న్యోఽ వ్యక్తోఽ వ్యక్తాత్సనాతనః ।**
**యస్స సర్వేషు భూతేషు నశ్యత్సు న వినశ్యతి ॥ (భ.గీ.8-20)**

తా:- ఏదైతే అవ్యక్తమైనదో! ఉత్తమమైనదో! ఇంద్రియాలకు వ్యక్తం కాదో! పురాతనమై ఉన్నదో! ఆ పరమాత్మ సమస్త ప్రాణి కోట్లు నశించినను, నశించకయే ఉండును.

ఇక్కడ శ్రీకృష్ణులవారు సమస్త ప్రాణి కోట్లు నశించినను అని చెప్పడం జరిగింది. అంటే సృష్టి అంతం గురించి ప్రస్తావించడం జరిగింది, అంతేకాదు సృష్టి అంతా అంతమైనా అంటే నశించినా భగవంతునికి అంటే ఆత్మకు నశింపు లేదని చెప్పడం జరిగింది.

ఆయన ఇంకా:-

**శ్లో॥ అవ్యక్తాద్వ్యక్తయః సర్వాః ప్రభవన్త్యహరాగమే ।**
**రాత్ర్యాగమే ప్రలీయన్తే తత్రైవావ్యక్తసంజ్ఞకే ॥ (భ.గీ.8-18)**

తా:- బ్రహ్మదేవుని పగలు ప్రారంభమైనప్పుడు, భగవంతుని నుండి అంటే అవ్యక్తము నుండి సమస్త చర అచర వస్తువులు పుడుతున్నాయి. మరల రాత్రి ప్రారంభమైనప్పుడు ఆ అవ్యక్తమునందే లీనం అవుతున్నాయి.

దీనిని బట్టి భగవంతునికి పగలు ప్రారంభమైంది అంటే? భగవంతుని నుండి అన్నీ అంటే చర, అచర వస్తువులన్నీ సృష్టింపబడు తున్నాయి. అలాగే

భగవంతునికి రాత్రి ప్రారంభం అయ్యింది అంటే? సృష్టింపబడినవన్నీ భగవంతునిలోనే లీనం అవుతున్నాయి, అంటే అంతం అవుతున్నాయి. అందుకే "భగవంతుడు కన్ను మూస్తే సృష్టి అంతము. కన్ను తెరిస్తే సృష్టి ఆరంభము" అంటారు.

అదే ఈ క్రింది శ్లోకంలో చెప్పబడింది.

**శ్లో॥ భూతగ్రామస్స ఏవాయం భూత్వా భూత్వా ప్రలీయతే ।**
**రాత్ర్యాగమేఽ వశః పార్థ ప్రభవత్యహరాగమే ॥ (భ.గీ.8-19)**

తా:- ఓ అర్జునా ఆయా ప్రాణి సమూహమే కర్మ పరాధీనమై పుట్టి, బ్రహ్మదేవుని రాత్రి యొక్క ఆరంభమునవిలయం పొందుచతున్నాయి. తిరిగి బ్రహ్మదేవుని పగటి యొక్క ప్రారంభమున పుడుతున్నాయి.

**శ్లో॥ సర్వభూతాని కౌన్తేయ ప్రకృతిం యాన్తి మామికామ్ ।**
**కల్పక్షయే పునస్తాని కల్పాదౌ విసృజామ్యహమ్ ॥ (భ.గీ.9-7)**

తా:- అర్జునా! సమస్త ప్రాణి కోట్లు ప్రళయకాలమున నా ప్రకృతిని అంటే మాయను చేరి అందు అణగి ఉండును. తిరిగి సృష్టి కాలమున వానిని నేను సృష్టించు చుందును.

దీనిని బట్టి సమస్త గ్రహ కూటాలు, సమస్త లోకాలు అంతమై పోయేవే అని తెలుసుకోవాలి. శాశ్వతంగా ఉండేది ఆత్మ ఒక్కటే అంటే భగవంతుడు ఒక్కడే అని మనకు తెలుస్తుంది. అందుచేత ఆత్మే సత్యమని తెలుసుకోవాలి.

# సత్యం యొక్క గొప్పతనం మరింత తెలుసుకుందాం

1. సృష్టి ఆదిలో ఉన్నది సత్యమే. సృష్టి అంతంలో  ఉండేది సత్యమే.
2. ఈ సృష్టి అంతకు సత్యమే మూలం.
3. సత్యమే అంతకు ఆధారం.
4. సత్యము వల్లనే అన్నిటి ఉనికి.
5. సత్యము అంటే ఎప్పుడు ఉండేది. అంటే ఆదిలోను, మధ్యలోనూ, అంతం లోనూ ఉండేది.
6. జాగ్రత్త అంటే మెలుకువ. స్వప్న అంటే కల. సుషుప్తి అంటే గాడ నిద్ర. ఈ మూడు అవస్థలకు సాక్షిగాఉండేదే సత్యం.
7. అహం అంటే నేను అనే జ్ఞానానికి సత్యమే ఆధారంగా ఉంది.
8. సత్యమే చిన్మయము అంటే ఆనందం.
9. సత్యమే జ్ఞానం అంటే జ్ఞాన స్వరూపము.
10. సత్యమే ప్రపంచం, ప్రపంచమే సత్యం.
11. అన్ని ఇంద్రియాలు చేసే పనులకు కారణం సత్యం.
12. పురుష ప్రకృతిల ఐక్య స్వరూపం కూడా సత్యమే.
13. సత్యము ద్రష్ట.   అంటే చూచునది
    అంతేకానీ దృశ్యము కాదు, అంటే కనబడునదికాదు.
14. సత్యము మనసు బుద్ధి మొదలగు వాటికి చైతన్యము కలుగచేస్తుంది.
15. సత్యము కాంతి స్వరూపం. ప్రపంచమంతా ప్రకాశింప చేస్తుంది.
16. సత్యమే సచ్చిదానంద స్వరూపం.
    అంటే సత్–చిత్–ఆనందం.
    సత్ అంటే సత్యమైనది.
    చిత్ అంటే చైతన్యవంతమైనది.
    ఆనందం అంటే అనందమైనది.
17. సత్యం అఖండ మైనది అంటే ముక్కలు కానిది. అవ్యయము అంటే రెండు కానిది. ఇదియే సత్యం యొక్క రహస్యం.
18. సత్యము ఉంది అని మాత్రమే తెలుసుకోగలం, ఇలాగ ఉంటుందని చెప్పలేని, అంతటా ఉండు, తుది, మొదలు లేని, మహా కాంతిమయ శక్తి, అదే పరమాత్మ.

# శంకరాచార్యుల వారి ఆత్మ బోధ

సత్యం గురించి అంటే బ్రహ్మం గురించి శంకరాచార్యుల వారి ఆత్మబోధ ద్వారా మరికొన్ని విషయాలు తెలుసుకుందాం.

- దేని కాంతి చేత సూర్యాదులు ప్రకాశిస్తున్నారో! దేనిని ఆ సూర్యాదులు ప్రకాశంప చెయ్యలేరో! దేని చేతనైతే సమస్తమైన జగత్తు అంతా ప్రకాశిస్తుందో! అదే బ్రహ్మం అని తెలుసుకోండి.
- స్థూలం కానిది– సూక్ష్మం కానిది, పొడుగు కానిది–పొట్టి కానిది, పుట్టుక లేనిది, మార్పు లేనిది, రూపం లేనిది, గుణం లేనిది, వర్ణం లేనిది, నామం లేనిది ఏదో అదే బ్రహ్మం, అదే సత్యం అని తెలుసుకోవాలి.
- పాలయందు వెన్న సర్వత్రా వ్యాపించి ఉన్నట్లుగా బ్రహ్మం సర్వ వ్యాపకమై ఉందని తెలుసుకోండి.
- "ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయాదులు అన్నీ ఎవరి వల్ల కలుగుతున్నాయో ఆయనే పరబ్రహ్మం" అని బ్రహ్మ సూత్రాలలో (1-2) వేద వ్యాసుల వారు వివరించారు.
- లోపల, బయట అన్నింటిలోనూ నిండి, అన్ని దిక్కుల వ్యాపించి ఉన్న సచ్చిదానంద స్వరూపమైనది, రెండు కానిది, ఆది అంతం లేకుండా అనంతంగా ఉన్నది, త్రికాలాలలోనూ ఉండేది, ఏకమైనది ఏది ఉందో అదే బ్రహ్మం అని తెలుసుకోండి.
- దేనిని చూస్తే ఇతరమైన వాటిని చూడవలసిన అవసరం లేదో! దేనిని పొందితే తిరిగి జన్మించవలసిన అవసరం లేదో! దేనిని తెలుసుకుంటే ఇతరమైన దానిని తెలుసుకోవలసిన అవసరం లేదో! అదే బ్రహ్మం అని తెలుసుకోండి

- ఏది పొందిన తరువాత ఇక పొందవలసింది లేదో! ఏ సుఖాన్ని అనుభవించిన తరువాత ఇక పొందవలసిన సుఖం అనేది లేదో! ఏ జ్ఞానాన్ని పొందిన తర్వాత ఇక పొందవలసిన జ్ఞానం అనేది లేదో! అదే బ్రహ్మం అని తెలుసుకొండి.

- అంతేకాదు నిత్యమైనది, శుద్ధమైనది, ముక్తమైనది, ఏకమైనది, అఖండ ఆనందమైనది, అద్వయ మైనది, సత్యమైనది, జ్ఞానమైనది, అనంతమైనది ఏదైతే ఉందో అదే బ్రహ్మం అని తెలుసుకోండి.

- ఆకాశం ఏ విధంగా సర్వత్ర వ్యాపించి ఉందో! పరబ్రహ్మ ఆ విధంగా సర్వత్ర వ్యాపించి బయట లోపల నిండి ఉన్నాడు.అయన నాశనము లేనివాడు, ఎల్లప్పుడూ ఎలాంటి మార్పులు లేకుండా ఉండేవాడు, అన్నిటియందు సమదృష్టి కలవాడు, పరిశుద్ధమైన వాడు, దేనితోనూ బంధాలు లేనివాడు, ఏ విధమైన మలినాలు లేకుండా స్వచ్ఛంగా ఉ ండేవాడు, అచలుడే కాదు దుఃఖం, బంధం, అసూయ, భయం లాంటి వికారాలు లేనివాడు అని తెలుసుకోండి.

- సూర్యునికి ప్రకాశం, నీటికి చల్లదనం, అగ్నికి వేడి ఎలా స్వభావమయి ఉన్నాయో! ఆ విధంగానే పరబ్రహ్మకు సచ్చిదానందం, శాశ్వతత్వం, నిర్మలత్వం స్వభావం అయి ఉన్నాయని తెలుసుకోండి.

- సర్వానికి ఆధారమై, సృష్టికి మూల కారణమైన పరబ్రహ్మ యందు ప్రపంచాలు నీటి యందు బుడగలవలే పుట్టి.. పెరిగి.. నశిస్తున్నాయని తెలుసుకోండి.

ఈ విధంగా శ్రీ ఆదిశంకరాచార్యుల వారు సత్యం గురించి అంటే పరబ్రహ్మ గొప్పతనం గురించి వివరించడం జరిగింది.

# సత్యము గురించి ఉపనిషత్తుల లోని వాక్యాలు

1. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"

తా:-సత్యము, అనంతమైన జ్ఞానమే బ్రహ్మ.

2. "యో వేద, విహితం గుహాయామ్"

తా:- ప్రతి వ్యక్తి యొక్క హృదయ మను గుహలో నిక్షిప్తమై ఉన్న ఆత్మే సత్యం.

3. "అణో రణీయాన్ మహితో మహీయాన్
ఆత్మా గుహాయాన్ రిహితోస్య జన్తో"

తా:- సత్యం అణువు కన్న అణువు, గొప్పది కన్నా గొప్పది.

4. "సదేన సోమ్యే దమగ్ర ఆసీత్"

తా:-ఆదిలో సత్ పదార్థము మాత్రమే ఉన్నది.

5. "ఏకమేవ అద్వితీయం బ్రహ్మ"

తా:- బ్రహ్మ ఒక్కడే వున్నాడు. రెండవది లేదు.

6. "సర్వం ఖల్విదం బ్రహ్మ"

తా:-అంతా బ్రహ్మమే.

7. "బ్రహ్మ విద్యే బ్రహ్మేవ భవతి"

తా:-బ్రహ్మమును తెలుసుకొనువాడు బ్రహ్మమే అవుతున్నాడు

8. "అరూప మస్పర్శ మశబ్ద మవ్యయం"

తా:- రూపము లేనిది, స్పర్శ లేనిది, శబ్దము లేనిది.

9. "ఆహాదిమత్ పరంబ్రహ్మ నసత్తన్నా ప్రదుచ్యతే "

తా:-ఉందని కానీ, లేదని కానీ చెప్ప శక్యం కానిది.

10. "సో హమ్ బ్రహ్మ"

తా:- ఆ బ్రహ్మమే నేను.

11. "తమేవాహ"

తా:- నీవే నేను అంటే ఆ బ్రహ్మమే నేను అయి వున్నాను.

12. "అహం బ్రహ్మాస్మి"

తా:- నేను బ్రహ్మనై వున్నాను.

# భగవద్గీతలో

13. **శ్లో॥ న జాయతే మ్రియతే వా కదాచిత్**

**నాయం భూత్వా ఽ భవితా వా న భూయః ।**


**అజో నిత్య శ్శాశ్వతోఽ యం పురాణో**

**న హన్యతే హన్యమానే శరీరే ॥**

**(భ.గీ. 2-20)**

తా:- ఈ ఆత్మ అంటే బ్రహ్మం అంటే సత్యం ఎప్పుడూ పుట్టడం లేదు, చావడం లేదు. పుట్టి మళ్లీ కొత్తగా ఉండేది కాదు. కారణం ఇది జన్మలేనిది, నిత్యమైనది, సనాతనమైనది, పురాతనమైనది. శరీరం చంపబడినా, ఆత్మ అన్నది చంపబడదు.

అటువంటి సత్యాన్ని అంటే ఆత్మను, జ్ఞాననేత్రం అంటే ఆత్మజ్ఞానం పొందిన వారే తెలుసుకోగలరు.



## ధ్యానం చేసే పద్ధతి శ్వాసమీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతున్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమ క్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీ మండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండల శుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

# జ్ఞాన నేత్రం

మనసు, బుద్ధి, చిత్తం, అహంకారం అని నాలుగు రకాలుగా పనిచేస్తున్న మనసును ఏకంగా ఆత్మలో లీనం చేసుకున్నవారే  జ్ఞాననేత్రం పొందినవారు.

ఒకరకంగా చెప్పాలంటే మనసును శూన్యం చేసుకొన్నవారు. అంటే " శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేసేవారే జ్ఞాననేత్రం సంపాదించుకోగలరు. వారినే ఆత్మజ్ఞానులు అంటారు.

అందుచేత ఆత్మజ్ఞానం కలిగినప్పుడే మానవ జీవితం సంపూర్ణం అవుతుంది.  అంతేకానీ నూరేళ్లు బ్రతికినంత మాత్రాన సంపూర్ణుడు కాలేడు.

పత్రీజీ ఇంకా ఏమన్నారంటే?  ఎన్ని జన్మలెత్తినా అందరూ అసత్యం లోనే జీవిస్తున్నారు. అలా ఎన్ని జన్మలు తీసుకుంటాం. ఎవరైనా సరే సత్యంలో జీవిస్తేనే మోక్షం అన్నారు.

అంతేకాదు సత్యం తెలుసుకోగలిగిన, సత్యంలో జీవించ గలిగిన జన్మ ఉన్నత మైన జన్మ అని పత్రీజీ అన్నారు.

అందుచేత సత్యాన్ని అంటే ఆత్మను ఆశ్రయిద్దాం. ఆ మార్గమే పత్రీజీ మనందరికీ అందించిన "శ్వాస మీద ధ్యాస ధ్యానం."

పత్రీజీ ఇంకా ఏమని చెప్పారంటే?

శ్రీకృష్ణుడు నాలుగేళ్ల వయసులోనే ధ్యానం నేర్చుకున్నాడు,

శ్రీ రాముడు పదేళ్ల వయసులోనే ధ్యానం నేర్చుకున్నాడు,

ఆంజనేయ స్వామి రెండేళ్ల వయసులోనే ధ్యానం నేర్చుకున్నాడు.

అందుచేత మనం కూడా సత్యాన్ని ఆశ్రయిద్దాం అంటే "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేద్దాం, సత్యాన్ని తెలుసుకుందాం,  సత్యంలో జీవిద్దాం.

సత్యంలో జీవించడమంటే? నేను ఆత్మను అన్నట్టుగా జీవించగలగాలి.

అంతే కాదు సత్యం గురించి ఇంకా తెలుసు కుందాం.

1. సత్యం అంటే? నిత్యమైనది, శాశ్వతమైనది, నసింపులేనిది, ఎల్లప్పుడూ ఉండేది, మార్పు చెందనిది, కాలం మారినా, యుగాలు మారినా మారనిది అని తెలుసుకున్నాం.

అంటే పుట్టదు, పెరగదు, మార్పుచెందదు, క్షయించదు అంటే క్షీణించదు అంటే తరగదు, నశించదు.

అదే "ఆత్మ" అంటే "భగవంతుడు.

2. సత్యం గ్రంథాలలో దొరకదు. సత్యం తెలుసుకోవాలంటే? "శవ దృష్టి వదిలి, శివ దృష్టి అలవర్చుకోవాలి". అంటే "దేహ దృష్టి వదలి, ఆత్మ దృష్టి అలవర్చుకోవాలి."

3.సత్య ప్రయాణం అరికాలి నుండి మొదలై తల పైభాగాన ముగుస్తుంది.

4. సత్యం గొప్పతనం. "THERE IS NO RELIGION HIGHER THAN TRUTH" " సత్యం కంటే గొప్ప మతం లేదు."

5. సత్యం అనుభవంలోకి వస్తే?

అందరూ అన్నీ ఒకటే, అంటే "అంతా నేనే – నేనే అంతా" అన్నట్టుగా జీవించ గలిగితే సత్యం అనుభవంలోకి తెచ్చుకొన్నట్టు.

6.సక్సెస్ కానీ, ఫెయిల్యూర్స్ కానీ సమానంగా తీసుకోగలగడమే సత్యంలో జీవించినట్టు. ఎందుచేతనంటే? "సత్యానికైనా సమ్మెట పోట్లు తప్పవు."

అంటే సత్యాన్ని ఆశ్రయించేవారి కైనా, సత్యమార్గంలో ప్రయాణించే వారికైనా, సత్యంలో జీవించే వారికైనా కష్టాలు తప్పవు.

# సత్యాన్ని పొందితే?

సత్యాన్ని పొందనంత వరకు, ఆస్తికుడిగా కనబడ్డా సరే నాస్తికుడే.

సత్యాన్ని పొందేక నాస్తికుడిగా కనబడ్డా సరే ఆస్తికుడే.

సజ్జన సాంగత్యంలో! సత్య కామకుల సాంగత్యంలో ఎండిన రొట్టె ముక్కను తినవలసి వచ్చినా, అది పరమాన్నం. మధుర పదార్థాల కంటే లక్ష రెట్లు అధికమని తెలుసుకోవాలి.

సత్యాన్ని అంటే  భగవంతుని అంటే ఆత్మను ఆశ్రయించకుండా, అసత్యాన్ని దేనిని ఆశ్రయించినా అంటే ఫోటోను కాని, విగ్రహాలను కాని, చెట్లను, పక్షులను, జంతువులను, మానవులను, మనస్సును, మ్యూజిక్‌ను వేటిని ఆశ్రయించినా భగవంతుని శక్తులు, లక్షణాలు ఏమి రావు.

ఎలాగంటే? మంటను ఆశ్రయించకుండా మంట బొమ్మను ఆశ్రయిస్తే వేడి తగలదు, చలి పోదు.

అందుకే జ్ఞానుల కూడా ఉన్న వారికి ఏమీ జ్ఞానం అంటదు.  కానీ ఆ జ్ఞానులు చెప్పినట్టు సత్యాన్ని ఆశ్రయిస్తే, మీరు కూడా జ్ఞానులు అవుతారు.

సత్యంలో జీవించేవాళ్ళు హాయినీ,  అసత్యంలో జీవించేవాళ్ళు దుఃఖాన్నీ పొందుతారు.

కొంతమంది ఎప్పుడూ పూజలు, వ్రతాలు, జపాలు చేస్తారు. మంచి పనులు చేస్తారు కానీ సత్యాన్ని తెలుసుకోరు. అటువంటివారే అజ్ఞానులు. తల్లి కావడం గొప్పతనం కాదు. కానీ సత్యమైన తల్లిలా బ్రతకడమే గొప్పతనం.

# ఆత్మ విచారణ
# (సత్య విచారణ)

నేతి....నేతి....  అంటే ఇది కాదు... ఇది కాదు... అనే విచారణ చేసుకుంటూ పోవాలి. అప్పుడు ఏది తొలగించడానికి వీలు లేనిదో అదే ఆత్మ అని తెలుసుకోవాలి.

అంటే ఆత్మ అంటే ఏమిటో!  అనాత్మ అంటే ఏమిటో! తెలుసుకోవాలి. గడ్డిపోచను వ్రేళ్లనుండి వేరుచేసినట్లు, ఆత్మను పంచకోశముల నుండి వేరుచేయాలి. అలా స్వప్రకాశ చైతన్యముతో నీవు ఐక్యము కావాలి. ఇక మిగిలినదంతయు నీ వైభవమే అయి ఉంటుంది.

నిత్యమైన వస్తువు సత్యమై ఉంటుంది, అదే ఆత్మ. దానికి అన్యమైన దంతా మాయారూపమే. అదే అనాత్మ. ఈరకంగా గ్రహించడమే " ఆత్మానాత్మ వివేకజ్ఞానము" అంటారు. ఇక్కడ రెండు విషయాలు మనం బాగా పరిశీలించాలి. మొదటిది మనకు గోచరించు ప్రపంచము. రెండవది దానిని గ్రహించు మనము.

దృశ్యమానజగత్తుకు ఏవిధమైన అస్తిత్వము లేదు. అది చూసేవారి మనసు కన్నా వేరుగా లేదు. పారమార్థిక సత్యమైన ఆత్మయే సత్యము. అటువంటి పారమార్థిక స్థాయిలో సంకల్పాలు కదిలేందుకు వీలులేకపోవటం వల్ల అక్కడ ద్వైత ప్రపంచము తెలిసే అవకాశమే లేదు. సత్యమైన ఆత్మ మరియొక దానిమీద ఆధారపడదు. మరియొకటి లేని స్థితియే ఆత్మ కనుక అక్కడ ద్వైతము అనూహ్యము. ఇలాంటి అద్వైత జ్ఞానాన్ని తెలుసుకోవడం వల్ల ఆత్మ అనుభవానికి వస్తుంది.

"ఇతర విద్యల యొక్క పరిజ్ఞానము అశాశ్వత మైనది. కానీ బ్రహ్మ యొక్క పరిజ్ఞానము వలన బ్రహ్మమునే పొందటం జరుగుతున్నది".

# ఆత్మా నాత్మ వివేకము

ఆత్మానాత్మ వివేకము వల్ల ఆత్మ సత్య మని, దానికి విరుద్ధమైనదంతయు మాయ అని తెలుస్తుంది. అలాంటి మాయారూపాలే పంచకోశాలు. పంచకోశాల నుండి విడువడినవాడు ముక్తపురుషుడే అవుతున్నాడు.

మాయారూపమైన అనాత్మ యందు తెలియునవి మాయాలక్షణములే అయినందున, భిన్నమైన దృక్పథములు కలుగుచుండును. ఆత్మ ఆధ్యయమైనందున,అందు భిన్నత్వమనకు తావులేదు. ఈ సత్యమును విచారణ పూర్వకముగా గ్రహించిన వ్యక్తి పంచకోశముల నుండి విడువడుతున్నాడు.

దృశ్యవస్తువు, ద్రష్ట కన్నా వేరు గనుక దృశ్యమైన దేహము, ద్రష్ట అయిన ఆత్మ అయ్యేందుకు వీలులేదు. అందుచేత ఆత్మ అన్నమయకోశమైన శరీరము కానేరదు.

ఆత్మ అనంతము గనుక అపరిమిత మైనది. దేహము, చలించే కారణమైన ప్రాణము దేహనికే పరిమితమై ఉన్నందున పరిమితమైన ప్రాణము అపరిమితమైన ఆత్మ అయ్యేందుకు వీలులేదు. కనుక ఆత్మ ప్రాణమయకోశం కానేరదు.

జడమైన వస్తువు చైతన్యము కన్న అన్యమైనది కనుక జడరూపమయిన మనసు చైతన్యవంతమైన ఆత్మ కానేరదు. కనుక ఆత్మ మనోమయ కోశం కానేరదు.

నిశ్చయాత్మకమైన బుద్ధియే విజ్ఞానమయకోశముగా తెలియుచున్నది. అయితే నిశ్చితానిశ్చితములు రెండింటిని ప్రకాశింపజేయు ఆత్మ ఈ రెండిలో ఏ ఒక్కటో అయ్యేందుకు వీలులేనందున ఆత్మ విజ్ఞానమయకోశము కూడా కానేరదు.

సుషుప్తియే ఆనందమయకోశము. అదొక అజ్ఞానావరణ. అజ్ఞానము ఉన్నది అని గ్రహించునది ఆత్మ యైనందున గ్రహించెడి, గ్రహించబడు అజ్ఞానముకన్నా అన్యమైనందున, ఆత్మ ఆనందమయకోశము కానేరదు. ఈ


పంచకోశములకు ఆధారమై, ఏదయితే పంచకోశముల "నుండి విడివడి యున్నదో అదియే ఆత్మ.

ఆ ఆత్మయే సత్తు. మరి ఈ ఆత్మను తెలుసుకొను "చిత్తు" వైన నీవు ఎవరు? సత్తుకన్నా చిత్తువేరుగా యున్నదా?

**"సత్త యాహి చిత్**

**చిత్త యా హ్యాహం"**

"సత్తుయే చిత్తుకాగా, ఆ చిత్తుయే నీవై ఉన్నావు" అని రమణమహర్షి ఉపదేశసార గ్రంథములో తెలుపుతారు. కనుక ఆత్మానాత్మ వివేకజ్ఞానము కలిగి, అనాత్మయైన పంచకోశములను వేరుచేసి చూడగా ఏదయితే మిగిలియున్నదో ఆదియే స్వప్రకాశ చైతన్యమైన ఆత్మ అదియే నీవు అని తెలుసుకోవాలి.

## పత్రీ గారి పుస్తకములు

| | | |
|---|---|---|
| 1) జ్ఞానరసగుళికలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 2) పరమగురువుల ప్రబోధాలు (పత్రీజీ) | - | రూ.160/- |
| 3) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |
| 4) జ్ఞాన సందేశాలు | - | రూ.160/- |
| 5) పత్రీజీ సందేశాలు | - | రూ.160/- |
| 6) విజ్ఞానసారం | - | రూ.160/- |
| 7) యోగుల సందేశాలు | - | రూ.160/- |

# సదానందయోగి ఏమన్నారంటే?

"కోరి సాధించరాదు, కొరకవచ్చింది కాదనరాదు, వస్తూంటే వస్తుందని సంబరపడరాదు, పోతుంటే పోతుందని భాధపడరాదు" అన్నారు.

అంటే లేనిది కోరకూడదు, ఉన్నది కాదనకూడదు, వస్తున్నదాన్ని చూచి సంబరాలు చేసుకోకూడదు, పోతున్నదానిని చూచి బాధపడకూడదు అని తెలుసుకోవాలి.

దీనికి ఇంకొక అర్ధమేమిటంటే? అసత్యాన్ని కోరకూడదు అంటే దేహానికి ప్రాముఖ్యం ఇవ్వకూడదు. ఉన్న సత్యాన్ని కాదనకూడదు అంటే వున్న ఆత్మకు ప్రాముఖ్యం ఇవ్వాలి. కారణం అసత్యమైన నీ శరీరం కచ్చితంగా పోతుంది. కాని సత్యమైన ఆత్మ ఎల్లప్పుడూ ఉంటుంది.

అందుచేత వచ్చేపోయే దానిని గురించి ఆలోచించకు. ఉండేదాని గురించి ఆలోచించు అని పెద్దలు చెపుతారు.

పునర్జన్మ సిద్ధాంతం తెలుసుకో... అత్మవైన నువ్వు శరీరం వదిలేస్తావు అంటే మరణిస్తావు, మరల కొత్త శరీరాన్ని దరిస్తావు అంటే జన్మిస్తావు. అందుచేత ఏడవకూడని దాని గురించి ఏడవడం మూర్ఖత్వం. నీవు చనిపోతే మళ్ళీ పుడతావు కదా? ఎందుకు బాధ పడతావు? ఆత్మ ఎపుడూ ఉంటుంది. ఆ సత్యాన్ని మరచిపోయి నీవు బాధపడుతున్నావు.

పునర్‌జన్మ గురించి నాస్తికత్వంలో మరణాన్ని ఒప్పుకుంటారు కానీ పునర్జన్మ ఒప్పుకోరు. 1930లో ఒక పాప నా భర్త ఫలానా చోట ఉన్నాడని మరి తమ పిల్లల గురించి చెప్పింది. వారు ఏ ఊరిలో ఉన్నారో చెప్పింది. ఆమె చెప్పిన దానిని తనిఖీ చేయగా ఆమె చెప్పిన ఊరిలో, స్థలంలో ఒక వృద్ధుడు వారి పిల్లలు వున్నారు. ఆమె పేరు శాంతిదేవి. ఇలాంటి పరిశోధనలు లెక్కలేనన్ని ఉన్నాయని పత్రీజీ చెప్పడం జరిగింది.

అభిమన్యుడు చనిపోయిన తరువాత, అర్జునునికి దుఃఖం వచ్చి, కృష్ణుని పట్టుకొని, నీకు తెలిసే ఇదంతా జరిగింది. నా కొడుకు నీ వల్లనే చనిపోయాడు అని అంటాడు. ఇక్కడ అర్జునుడు కూడా అసత్యంగానే ప్రవర్తించాడు. ఉన్న సత్యాన్ని పక్కన పెట్టడమే దుఃఖానికి కారణం, సత్యాన్ని విడిచి బ్రతకడమే ప్రాపంచికత, సత్యంలో ప్రవేశించి బ్రతకడమే ఆధ్యాత్మికత. ఎన్ని జన్మలు ఎత్తినా కొంతమంది అసత్యంలోనే జీవిస్తున్నారు. అసత్యం నుండి దూరం కావాలంటే ప్రతి ఒక్కరూ 'శ్వాస మీద ధ్యాస' వుంచి ధ్యానం చేయవలసిందే.

మనిషికి చావు ఉంటుంది కానీ ఆత్మకు చావు లేదు. అందరూ దానిని

మరచి పోతున్నారు. అది అనాధ్యాత్మికత..

యక్ష ప్రశ్నల్లో ఒక ప్రశ్న ఏమిటంటే.. "ప్రపంచంలో అన్నిటికన్నా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటి?" అని యక్షుడు అడుగుతాడు. అపుడు ధర్మరాజు "చుట్టుపక్కల అందరూ చనిపోతున్నా, తాను మాత్రం చనిపోను అని ప్రతి మనిషి అనుకుంటాడు. ఇదే ఆశ్చర్యకరమైన విషయం" అని చెప్తాడు.

అందరూ చనిపోవాల్సిందే. ఈ మౌలిక సత్యాన్ని గుర్తించిననాడే ఆధ్యాత్మిక ధైర్యాన్ని, ఆనందాన్ని తీసుకొని వస్తాయి. ప్రతి ఒక్కరూ లోకంలో ఎక్కడా లేని కష్టాలు నాకే వచ్చాయి అనుకుంటారు. అది గొప్ప మూర్ఖత్వం, గొప్ప అసత్యం.

సత్యంలో జీవించేవాళ్ళు ఎన్ని కష్టాలు వచ్చినా హాయిగా జీవిస్తారు. అసత్యంలో జీవించేవాళ్ళు ఎప్పుడూ. దుఃఖిస్తూనే ఉంటారు. ఆధ్యాత్మికత అంటే సత్యంలో జీవించడం. ప్రాపంచికత అంటే సత్యాన్ని ప్రక్కన పెట్టి జీవించడం. చావు అనేది పుట్టుకతోనే సాధ్యం. పుట్టినవాడు చావకు తప్పదు, చచ్చినవాడు పుట్టక తప్పదు అని గీతలో చెప్పబడింది కదా?

**శ్లో॥ జాతస్య హి ధ్రువో మృత్యుర్ధ్రువం జన్మ మృతస్య చ ।**
**తస్మాదపరిహార్యేఽర్థే న త్వం శోచితు మర్హసి ॥ (భ.గీ.2-27)**

తా:-ఏ విధంగా చూసినా జన్మించిన వానికి చావు తప్పదు, చనిపోయిన వాడు జన్మించక తప్పదు. అనివార్యమగు ఈ విషయం గూర్చి నీవు శోకించతగదు.

దేనికైతే నివారణోపాయం లేదో, దానికోసం ఎందుకు ఏడుస్తున్నావు? ఆధ్యాత్మికత అంటే సత్యాలను ఎప్పుడూ జ్ఞాపకం తెచ్చుకోవడం. పుట్టినవాడు చావక తప్పదు అనే విషయం అందరికీ తెలుసు. కానీ చనిపోయిన వాడు మళ్ళీ పుడతాడు అనేది గొప్ప ఆధ్యాత్మిక సత్యం. గ్రంథాల పట్ల, ఋషుల పట్ల, యోగుల పట్ల మనం నమ్మకం ఉంచుకోవాలి.

పత్రీజీ ఏమన్నారంటే? ఎన్ని జన్మలెత్తినా అందరూ అసత్యం లోనే జీవిస్తున్నారు. అలా ఎన్ని జన్మలు తీసుకుంటాం. ఎవరైనా సరే సత్యంలో జీవిస్తేనే మోక్షం అన్నారు. అందుకే ఆయన "అసత్యమైన విగ్రహారాధన వద్దు. సత్యమైన ఆత్మనే ధ్యానం ద్వారా ఆరాధించమన్నారు".

అంతేకాదు సత్యం తెలుసుకోగలిగిన, సత్యంలో జీవించ గలిగిన జన్మ ఉన్నత మైన జన్మ అని పత్రీజీ అన్నారు.

అందుచేత సత్యాన్ని అంటే ఆత్మను ఆశ్రయిద్దాం. ఆ మార్గమే పత్రీజీ మనందరికీ అందించిన "శ్వాస మీద ధ్యాస ధ్యానం."

"సత్య జీవితం యొక్క పరిణామము అమృతమయమై పరిణమిస్తుంది. అసత్య జీవిత పరిణామము విషభూయిష్టమై పరిణమిస్తుందని" మరువకూడదు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - | రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - | రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - | రూ.130/- |
| 4) భగవంతుడంటే | - | రూ.130/- |
| 5) సత్యమార్గం | - | రూ.160/- |
| 6) ఆత్మ శాస్త్రం | - | రూ.130/- |
| 7) ధ్యాన శాస్త్రం | - | రూ.130/- |
| 8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - | రూ.160/- |
| 9) ధ్యాన శక్తి | - | రూ.130/- |
| 10) తెలుసుకోండి | - | రూ.130/- |
| 11) జీవిత సూక్ష్మాలు | - | రూ.130/- |
| 12) మరణించకముందే మరణించాలి | - | రూ.130/- |
| 13) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) | - | రూ.160/- |
| 14) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? | - | రూ.120/- |
| 15) గీతాసందేశం | - | రూ.100/- |
| 16) కర్మ సిద్ధాంతం | - | రూ.80/- |
| 17) ధ్యానమంటే ? | - | రూ.80/- |
| 18) ఆత్మజ్ఞానం ఎందుకు? | - | రూ.70/- |
| 19) జ్ఞాన జ్యోతి | - | రూ.70/- |
| 220) జ్ఞాన కుసుమాలు | - | రూ.70/- |
| 21) దుఃఖ నివారణామార్గం | - | రూ.60/- |
| 22) బ్రహ్మజ్ఞానం | - | రూ.60/- |
| 23) త్రివిధాలు | - | రూ.60/- |
| 24) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |
| 25) ధ్యానం వల్లనే జ్ఞానం | - | రూ.60/- |
| 26) అతీంద్రియ శక్తులు | - | రూ.60/- |
| 27) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - | రూ.60/- |
| 28) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - | రూ.60/- |
| 29) భూతదయే దైవత్వం | - | రూ.60/- |
| 30) ఆలోచించండి | - | రూ.60/- |
| 31) షిరిడీ సాయి సందేశాలు | - | రూ.60/- |
| 32) సంకల్పమంటే? | - | రూ.50/- |
| 33) ఈ జీవితం ఎందుకు? | - | రూ.50/- |
| 34) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - | రూ.50/- |
| 35) నిర్వాణ మార్గం | - | రూ.50/- |
| 36) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే | - | రూ.50/- |
| 37) సత్యం | - | రూ.40/- |
| 38) చక్రాలు | - | రూ.40/- |
| 39) భాగవత సన్నివేశాల అంతరార్థం | - | రూ.40/- |
| 40) మౌన ధ్యానం | - | రూ.40/- |
| 41) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - | రూ.20/- |
| 42) శాకాహారమే మానవాహారం | - | రూ.15/- |
| 43) అహింస మరియు శాఖాహారం | - | రూ.15/- |


పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్: 9440309812, 9490171853



# సత్యం

1. సృష్టి ఆదిలో ఉన్నది సత్యమే. సృష్టి అంతంలో ఉండేది సత్యమే.
2. ఈ సృష్టి అంతకు సత్యమే మూలం.
3. సత్యమే అంతకు ఆధారం.
4. సత్యము వల్లనే అన్నిటి ఉనికి.
5. జాగ్రత్త అంటే మెలుకువ. స్వప్న అంటే కల. సుషుప్తి అంటే గాఢ నిద్ర. ఈ మూడు అవస్థలకు సాక్షిగాఉండేదే సత్యం.
6. అహం అంటే నేను అనే జ్ఞానానికి సత్యమే ఆధారంగా ఉంది.
7. సత్యమే చిన్మయము అంటే ఆనందం.
8. సత్యమే జ్ఞానం అంటే జ్ఞాన స్వరూపము.
9. అన్ని ఇంద్రియాలు చేసే పనులకు కారణం సత్యం.
10. పురుష ప్రకృతిల ఐక్య స్వరూపం కూడా సత్యమే.
11. సత్యము ద్రష్ట. అంటే చూచునది అంతేకానీ దృశ్యము కాదు, అంటే కనబడునదికాదు.
12. సత్యము ఉంది అని మాత్రమే తెలుసుకోగలం, ఇలాగ ఉంటుందని చెప్పలేని, అంతటా ఉండు, తుది, మొదలు లేని, మహా కాంతిమయ శక్తి, అదే పరమాత్మ.

రూ.40/-